# అనురాగ సంగమం

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అన్నారు పెద్దలు. జన్మనిచ్చిన తల్లి, మన జన్మభూమి, స్వర్గముకంటే గొప్పదని సారాంశం. కాని ఈ రోజు జరుగుతున్నదేమిటి? నవ మాసాలు మోసి, దుర్భర ప్రసవవేదనకులోనై ఈ లోకంలోకి తెచ్చిన అమ్మను, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని చదువు సంధ్యలు చెప్పించిన తల్లిదండ్రులను, తాము పస్తులున్నా తమ ముద్దుల తనయులకు ఉన్నంతలో మంచి భోజనం పెట్టి సాకిన మతా పితలను, వారి మానాన వారిని వదిలివేసి ఎక్కడికో ఎగిరిపోతున్నారు నేటి కొడుకులు.

కొన్ని సంవత్సరాలు బాగా డబ్బు గడించి తిరిగి మన దేశం వస్తామన్న వారు, సకల సౌఖ్యాలకు బానిసలై తమ తల్లిదండ్రులను, తమ దేశాన్ని ఈసడించుకునే స్థితికి దిగజారుతున్నారు. తల్లిదండ్రుల అంతిమ సంస్కారానికి రావడానికి కూడా డబ్బు లెక్క పెట్టుకునే ప్రబుద్ధులు తయారయ్యారు. కొందరు వృద్ధులు, ఎంతటి ఆస్తి ఉన్నా, స్థితిమంతులైన కొడుకులున్నా, అనాథల్లా బిక్కు బిక్కుమంటూ దినాలు వెళ్ళదీస్తూ, కృంగి, కృషించి నశించి పోతున్నారు.

అయితే అందరు కొడుకులు ఒకేలా ఉండరు. కారు మేఘాల్లో ఓ మెరుపు తీగ కనిపిస్తుంది. అలాంటి మెరుపుతీగే మన త్రినాథరావుగారు. ఈ "అమ్మా, నాన్నా

ఆనంద నిలయం"కి సంస్థాపక అధినేత. విదేశాల్లో ఉండి కోట్లు గడించారు. ఇప్పుడు తన శేష జీవితాన్ని మన దేశమాతకు అంకితము చేశారు. తన తల్లిదండ్రులు పరమపదించినా, ఇతరుల్లో వారిని చూసుకుంటూ, సాయంసంధ్యలో తోడుకోసం తడుముకునే వృద్ధులకు ఒక కుటుంబ వాతావరణం కల్పించడానికి పూనుకున్నారు త్రినాథరావుగారు. విదేశాల్లో, వైద్య వృత్తిలో పాతిక సంవత్సరాలకుపైగా ఉండి కోట్ల డాలర్లు సంపాదించారు. ఇంకా ఎంతో సంపాదించే అవకాశాలున్నా, తన జన్మ భూమికి, తనలాంటి ఎందరికో జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఆలనాపాలనా చూడడానికి, మన రాష్ట్రానికి తిరిగి వచ్చారు. ఈ ఆనంద నిలయంలో, ఆధునిక వసతులున్న గదులేకాక ఒక అధునాతన ఆసుపత్రి కూడా ఉంది. ఇక్కడి వారి వినోదానికి, కాలక్షేపానికి ఎన్నో వనరులున్నాయి. ఇక్కడి ఉద్యానవనాలు సుశోభితంగా ముస్తాబై ఇక్కడి నివాసులకే కాక సామాన్య ప్రజలకూ స్వాగతం పలుకుతాయి. ఈ విధంగా ఇక్కడి అమ్మా నాన్నలు ఈ పరిసరాల్లోకి వచ్చే పిల్లలలో తమ మనవలను, మనవరాండ్రను చూసుకునే వీలుంది. ఇంకా నాకు తెలిసిందేమంటే వీరి "అనురాగ సంగమం" పథకం ద్వారా, చిన్న పిల్లలున్న దంపతులకు ఇక్కడి అమ్మా, నాన్నలతో గడిపే వీలుందని, అలాగే వీరికి తమకు తెలిసిన, తమను కోరుకునే కుటుంబాలతో వారి, వారి ఇండ్లల్లో కొన్ని రోజులు గడిపే అవకాశం ఉందని. ఇక్కడి వసతులకు ఏమాత్రం ఫీజులుగానీ, చార్జీలుగానీ లేకపోవడం ఈ నిలయం మరో ప్రత్యేకత. ఇన్ని హంగులున్న విలక్షణ సంస్థ మన రాష్ట్రంలో ఆరంభం కావడం, దానికి నన్ను ఆహ్వానించడం, నా సుకృతంగా భావిస్తున్నాను. ఈ స్వచ్ఛంద సంస్థకు అన్ని సహాయ సహకారాలు మన రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇస్తున్నాను. ఈ ప్రకల్పం విజయవంతమై దీని శాఖలు రాష్ట్రం నలుమూలల ఏర్పడాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను."

రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రివర్యుల ఉపన్యాసం పూర్తైయింది. చప్పట్లు మారుమ్రోగాయి. "ఇప్పుడు 'అమ్మా, నాన్నా ఆనందనిలయం' అధ్యక్షులు శ్రీ త్రినాథరావు గారి స్పందన" సభాధ్యక్షులు ప్రకటించారు.

"గౌరవనీయ మంత్రివర్యులకు, వేదికనలంకరించిన పెద్దలకు, సభాసదులకు నమస్కారము. ఈ రోజు నా జీవితంలో స్వర్ణాక్షరాలతో లిఖించదగ్గ సుదినం. దాదాపు మూడు సంవత్సరాల క్రితం, నా మనసులో పడ్డ బీజం, ఈ రోజు ఒక చిరు చెట్టుగా ఎదిగింది. నా జన్మ తరించింది. పాతిక సంవత్సరాలు అమెరికాలో వృత్తిలో ఎన్నో శిఖరాలు అధిరోహించాను. ఎంతో డబ్బు గడించాను. ఎన్నో సౌఖ్యాలను అనుభ

వించాను. అవన్నీ ఒక ఎత్తైతే ఈ రోజు నేను పొందిన ఆనందం, నాకు కలిగిన సంతృప్తి ఇంకోఎత్తు. నా ఎదురు కూర్చున్న అమ్మా నాన్నల నవ్వులు నా హృదయంలో పూచిన పువ్వులయ్యాయి. తమ సుఖం మాత్రమే చూసుకోవడంలో లేని తృప్తి, ఇంకొకరి కష్టాల్లో పాలుపంచుకోవడంలో ఉందని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. కాకపోతే, నేనూ అందరిలా నా స్వార్థం కోసం జీవించిన వాణ్నే.

దాదాపు మూడు సంవత్సరాల క్రితం వృత్తిరీత్యా ఈ నగరానికి వచ్చిన నాకు, ఇక్కడికి దగ్గరలోనే ఉన్న మా ఊరుని చూడాలనిపించింది. నా పని పూర్తి కాగానే కార్లో, మా ఊరు బయలుదేరాను. మా ఊరు దగ్గరగా వచ్చినప్పుడు నాలో ఉద్వేగం. నేను పెరిగిన ఊరు. నా బాల్యం గడిపిన ఊరు. మా అమ్మా, నాన్నలను వదిలి, నేను విదేశాలకు వెళ్ళిన ఊరు. మా వాళ్ళ అంతిమ సంస్కారానికి కూడా రాలేకపోయిన నా దుస్థితి. అంతా కళ్ళముందు నిలిచింది.

అంతలోనే కొన్ని శోక స్వరాలు వినబడ్డాయి. మా ఊరి దళితవాడలోని ఓ గుడిసె ముందు చాలామంది గుమిగూడి ఉన్నారు. విషయమేంటో కనుక్కురమ్మని డ్రైవరును పంపించాను. ఎవరో ముసలమ్మ మరణించిందని కబురు తెచ్చాడు డ్రైవరు. నాకు మా అమ్మ జ్ఞాపకం వచ్చింది. ఆమె చావు గుర్తుకొచ్చింది. వెంటనే కారు దిగాను. ముసలమ్మ శవం ఓ కుక్కి మంచంపై ఉంది. ఆమె కొడుకు మసకట్‌లో ఉన్నాడట. ఫోన్ చేస్తే కంపెనీ పనిమీద వేరే చోటుకు వెళ్ళాడని తెలిసింది. శవం వాసనోస్తోంది. క్రితం రోజు చనిపోయిందట. వాసన వేయదు మరీ! దహన కర్మకు డబ్బులు లేవట. ముసలమ్మ భర్త నిర్వికారంగా కూర్చున్నాడు. అతని కళ్ళనుండి అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి. తుడుచుకోవాలనే ధ్యాసలేదు. తుడిచే నాథుడులేడు. నాకు మా నాన్న మదిలో మెదిలాడు. అమ్మ మరణించిన నెల లోపే ఆయన అమ్మను వెతుకుంటూ వెళ్లాడు. కాకపోతే అది సహజ మరణం కాదు. ఏకాకితనం భరించలేక, పలకరించే నాథుడులేక, ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ముసలాయనకు ఆ గతి పట్టగూడ దనుకున్నాను. దగ్గరుండి ముసలమ్మ అంతిమ సంస్కారం చేయించాను. ఆ వృద్ధున్ని ఈ నగరానికి తీసుకువచ్చి ఓ వృద్ధాశ్రమంలో చేర్పించాను. ఆ వృద్ధాశ్రమంలో పరిస్థితి గమనించేసరికి నా కళ్ళు చెమర్చాయి. సిబ్బంది కసుర్లూ, విసుర్లూ చెవులార విన్నాను. ఏదో మొక్కుబడికి, ఉద్యోగరీత్యా పనులు చేసే సిబ్బంది ప్రవర్తన, అక్కడి అమ్మా, నాన్నలకు ఉపశమనం కల్గించకపోగా, మరింత క్షోభకు గురిచేస్తున్నట్టనిపించింది. అప్పుడే ఈ ఆనందనిలయం రూపురేఖలు నా మనసులో ముద్రించుకున్నాను. అమెరికా తిరిగి వెళ్ళి, నా. భార్య వసంతతో చర్చించాను. ఆమె, మొదట కాస్త వెనుకాడినా,

తరువాత అర్థం చేసుకుంది. దాని పర్యావసానమే మేము అమెరికా వదిలి, మన రాష్ట్రానికి రావాలన్న నిర్ణయం. అంతవరకు వృత్తివిజయాలపై, సంపాదనపై దృష్టి నిలిపిన మేము, మన మాతృ దేశానికి సేవ చేయాలని నిశ్చయించాము. ఈ సంస్థ ఒక ఆశ్రమంలాకాక, ఆనందనిలయంలా, అనురాగ సంగమంలా రూపొందాలని, నిపుణులచే మంచి పథకం రూపొందించాము. మీ అందరి సహాయ సహకారాలతో ఈ సంస్థ పరిధిని మరింత విస్తరింప జేయాలనుకుంటున్నాము. మా ఈ కృషికి చేయూత నిస్తారనీ, మీ అండదండలతో ఈ అనురాగసంగమం అమ్మా, నాన్నల నవ్వుల పువ్వులతో విలసిల్లగలదని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను."

ఆ ఆవరణంతా చప్పట్లతో మారుమ్రోగింది. కొందరి కళ్ళల్లో ఆనంద భాష్పాలు. ఎవరి నోట విన్నా డాక్టరు దంపతుల గురించి ప్రశంసే. కొందరు అక్కడి వసతుల గురించి చర్చిస్తే, కొందరు అక్కడ చేరినవారి గురించి వివరాలు తెలుసుకుంటున్నారు. సభ ముగిసింది. ఆహుతులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కొందరు అటువైపు వెళితే, కొందరు ఆ పరిసరాలను దర్శించడానికి పూనుకున్నారు.

"నమస్కారమండీ! నా పేరు చింతలరావు. ఈమె నా శ్రీమతి వెన్నెల. ఈ ఆనంద నిలయం గురించి పత్రికల్లో చదివి మిమ్ముల్ని కలుసుకోవాలని వచ్చాం.

"మీదే ఊరండీ"

"మాది ప్రక్క జిల్లానే నా పేరు రామభద్రరాజు. నా భార్య సీతాలక్ష్మి. నెల క్రితమే ఇక్కడ చేరాము."

"మీ నేపథ్యంలో చెబుతారా?"

"మాకిద్దరు కూతుళ్లు, ఒక బాబు. అమ్మాయిల పెళ్ళిళ్ళు చేశాము. అబ్బాయి అమెరికాలో స్థిరపడ్డాడు. మేమిక్కడ పడ్డాము." రామభద్రరాజు గొంతులో బాధ.

"మీరేమనుకోకపోతే కాస్త వివరంగా చెబుతారా ?"

"చెప్పడానికేముంది నాయనా ! మేమొకటి తలిస్తే, దేవుడొకటి తలిచాడు. కూతుళ్లు పరాయి ఇంటికి వెళ్లే వారే గదా! అని, వారి స్కూల్ ఫైనల్ కాగానే మాకు తగ్గ సంబంధాలు చూసి పెళ్ళి చేశాము. వంశోద్ధారకున్ని మాత్రం పిజి దాకా చదివించాం. ఆ తర్వాత పై చదువులకు అమెరికా వెళతానంటే, ఉన్న పొలమమ్మి డబ్బు సమకూర్చాం. ఇక చెప్పేదేముంది? మామూలు కథే. మా అబ్బాయి అక్కడే ఉద్యోగం చూసుకున్నాడు. మా ప్రమేయం లేకుండా పెళ్ళి కూడా చేసుకున్నాడు. అదో పెద్ద కథ.

"పెద్ద కథను కాస్త కుదించి చెపుతారా ?"

"మీకంతగా వినాలనుకుంటే ఎందుకు చెప్పను? మా వాడికి మా బామ్మర్ది కూతురిని చేసుకుందామని అనుకున్నాం. మా వాడు అమెరికా వెళ్ళిన ఆర్నెల్లకు, ఆ అమ్మాయి కాస్త ఇంకెవరినో రిజిస్టరు పెళ్లి చేసుకుంది. ఇక దాంతో మా వాడు విరక్తి చెంది, అక్కడే పుట్టి పెరిగిన తెలుగమ్మాయిని చేసుకున్నాడు."

❁❁❁

"రండి, రండ్రండి" కృష్ణహరి, భాగ్యమ్మ ఇద్దరూ ఒకేసారి అన్నారు. తమ గదిలోకి వచ్చిన రంగనాథశాస్త్రి, అనుసూయమ్మలను ఉద్దేశించి. వచ్చి వారు కుర్చీలో కూర్చున్నారు.

"ఏంది సార్! గిట్లచ్చింండ్రు. మాతోని ఏం తప్పు కాలేదుగదా?"

"అలాంటిదేం లేదు కృష్ణహరిగారూ! కొన్ని రోజుల నుంచి కలిసిమెలిసి ఉంటున్నాం. పేర్లు తప్పించి ఒకరొకరి కష్టసుఖాలు తెల్సింది లేదు. మన కష్ట సుఖాలు పరస్పరం చెప్పుకుంటే మనసులు దగ్గరౌతాయి. భారం తగ్గుతుంది."

"ఓసారూ! మీ రన్నది నివద్దే (నిజమే). మేం గరీబోల్లం. మా రూంకు మీ అసుంటి పెద్దోల్లు అచ్చింండ్రంటే శాల కుశాలుగున్నది.

"ఇక్కడ మనమందరం ఒకటే. ధనిక, పేద భేదాలు లేవు. మీ గురించి వినాలనుంది."

"నేను బొంబాయిల బట్టల మిల్లు వర్కర్‌గ జేసిన. అదెవడో దత్తాసామంత్ పుణ్యమా లని, మా మిల్లు బందుపడ్డది. మేం రోడ్డు మీద పడ్డాం. మా కొడుకు సదు అటకెక్కింది. మిల్లునుంచి దొరికిన పైసల్తోని మా బిడ్డ లగ్గం జేశినం. కొడుకును దుబాయి పంపినం. నాకా పని లేదు. ఇగ బొంబాయిలుండే తందుకేమున్నది? మా ఊరుకు తిరిగి వచ్చినం. కొడుక్కు లగ్గంజేశినం. ఆడికిద్దరు పిల్లలు. మా కోడలుకు బాగ సీపతి (టెక్కు) దాని మొగుడు దుబైల బాగా కమాయిత్తడని (సంపాదిస్తాడని) పోకడ (గర్వం). మాకున్నదంత అల్లకిత్తే, మా కోడలు మా సేతికి సిప్పనిచ్చింది. ఏ దేవును పున్యాన్నో గీ డాక్టరు, మమ్ములను గిక్కడ శరీక్ జేసుకున్నడు. (చేర్చుకున్నాడు). మాది సరేగనీ, మీరు బాగ ఉన్నోల్ల లెక్క ఉన్నరు. మీరు గీడ ఉండేతందుకేం గాచారమచ్చే?"

"ఉన్నోల్లమంటే మీ ఉద్దేశ్యంలో డబ్బు, ఆస్తిపరంగా అనుకుంటే, మే మున్నోల్లమే. ఎవరో అన్నట్లు, డబ్బుతో పరుపును కొనగలం కాని నిద్రను కొనలేం కదా! మా గతీ అంతే. చెప్పుకోవడానికి ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. ఒక అబ్బాయి

ఢిల్లీలో ఓ ఉన్నత ప్రభుత్వోద్యోగి, మధ్యవాడు మద్రాసులో జడ్జి, చిన్నవాడు అమెరికాలో డాక్టరు. కూతుళ్ళను కూడ సంపన్నుల ఇంట్లోకే ఇచ్చాం. వారందరికి మంచి చదువులు చెప్పించి, పెళ్ళిళ్లు కూడా ఘనంగానే చేశాం. ఎవరికి వారు భోగభాగ్యాలతో సుఖంగా కాపురాలు చేసుకుంటున్నారు. అయినా వారందరిదీ మా ఆస్తి మీదే కన్ను. డబ్బు మీదే మోజు. మా బాగోగుల్ని కనుక్కునే సమయం వారికి లేదు. ఏదో కల్పించిన అవసరాల పేరుతో మా దగ్గరనుండి సొమ్ము దండుకోవాలని చూస్తారు. కాదంటే ఎడమొహం, పెడమొహం. ఆస్తి ఏం చేసుకుంటారు? పోయేప్పుడు వెంటతీసుకు పోతారా? అని విసుర్లు. ఈ మనఃక్లేశాలతో విసుగెత్తి, ఏ ఆశ్రమంలోనో చేరుదామను కున్నాం. అంతలో ఈ ఆనంద నిలయం ప్రకటన చూశాం. ఇంటర్వ్యూలో ఎంపిక చేశారు. అలా ఇక్కడ చేరాం. ఇప్పుడిక్కడ ప్రశాంతంగా ఉంది. స్వార్జితమైన యావదాస్తిని ఈ సంస్థకు విరాళంగా ఇవ్వాలనుకుంటున్నాను. ముగించారు రంగనాథ శాస్త్రి."

"శానమంచిది సారూ! మీ అసుంటి పెద్ద మనుసున్నోల్లు ఉండవట్టే ఈ దునియ ఈ మాత్రం నడుస్తున్నది. మా అసుంటోల్లకు నీడ దొరుకుతున్నది." మనస్ఫూర్తిగా అన్నాడు కృష్ణహరి. భాగ్యమ్మ దండం పెట్టింది. రంగనాథశాస్త్రి, అనసూయమ్మలు ప్రక్క గదిలోకి నడిచారు. అక్కడ గాజుల నర్సయ్య ఒక్కడే ఉన్నాడు. అతనికి కొడుకులు లేరు. కూతురు అల్లుడు సూరతులో ఉన్నారు. అల్లుడు అక్కడ డైమండ్ కట్టర్, భార్య మరణం తరువాత అంతిమ క్రియలకు వచ్చిన కూతురు బలవంతం చేయడంతో సూరత్ వెళ్ళాడు నర్సయ్య. వారతన్ని బాగానే చూసుకున్నారు. కాని నర్సయ్యకే, కూతురుకు భారం కావడం మనుసొప్పక స్వగ్రామం తిరిగి వచ్చాడు. ఎవరో ఆనంద నిలయం గురించి చెబితే దరఖాస్తు చేశాడు. ఆ తరువాత ముఖాముఖిలో ఎంపికై ఆనంద నిలయంలో చేరాడు.

ఇక భుజంగరావు సావిత్రమ్మలది ఇంకొక కథ. కొడుకుపట్ల వారు చూపిన కాఠిన్యం, ముసలితనంలో వారికి శాపమయింది. కొడుకుకు తను ప్రేమించిన అమ్మాయితో కాకుండా, తమ కులానికి చెందిన తమకు నచ్చిన ఇంకో ఆస్తిపరుల అమ్మాయిని కట్టబెట్టినందుకు కొడుకు మనసు విరిగింది. దానికితోడు, వారి కాపురంలో కూడా సావిత్రమ్మ ప్రమేయం ఎక్కువయ్యే సరికి, కొడుకు, కోడలు వీరి ఆగడాలకు తాళలేక మద్రాసుకు మకాం మార్చారు. కుడితిలో పడ్డ ఎలుకల్లా మారిన భుజంగరావు, సావిత్రమ్మలు తమతమ తప్పిదానికి ప్రాయశ్చిత్తంగా, తోటి వారికి సేవ చేయాలనే భావనతో ఆనంద నిలయంలో చేరారు.

❂❂❂

డాక్టరు త్రినాధరావుగారి చేంబర్.

"సార్ పిలిచారా?"

"అవును ఉదయకిరణ్ గారూ! మన ప్రక్క రాష్ట్రం నుంచి ఓ ప్రతినిధి బృందం వచ్చింది. వారు మన సంస్థ నిర్వహణ గురించి తెలుసుకోవాలనుకుంటున్నారు." వచ్చిన బృందానికి జనరల్ మేనేజర్ ఉదయకిరణ్‌ని పరిచయం చేశారు డాక్టర్ త్రినాధరావు.

పరస్పర పరిచయాలయ్యాక, ఆహూతులకు ఆనంద నిలయం సందర్శనానికి బయలుదేర దీశాడు ఉదయకిరణ్. మొట్టమొదట, ఆవరణ నమూనాను గాజు పలకంలో చూపించాడు. సంభాషణ ఇంగ్లీషులో సాగింది.

"ఇది ఆఫీస్ కాంప్లెక్స్, అంటే మనమున్న చోటు. మూడంతస్థుల ఈ భవనములో పై కప్పులో పెంటౌస్ ఉంది. అది డాక్టరు దంపతుల నివాసం. మూడవ ఫ్లోర్ లో చైర్ పర్సన్ డాక్టరు వసంతగారి చేంబర్, ఛైర్మన్ డాక్టర్ త్రినాధరావుగారి చేంబర్, మరియు వారి ఆఫీసు సిబ్బంది కార్యాలయం వున్నాయి. రెండవ అంతస్థులో ఎగ్రో అండ్ హార్టికల్చరల్ విభాగం కార్యాలయం. డాక్టరు తిరుమలరావు ఆ విభాగాధిపతి. మొదటి అంతస్థులో మా కార్యాలయం అంటే ఆర్థిక మరియు నిర్వహణ విభాగ కార్యాలయం ఉంది. నేను కూర్చుండేది మొదటి అంతస్థులోనే. మా ఫైనాన్స్ విభాగాధిపతి శ్రీ తిమ్మరాజుగారి చేంబర్ నా ప్రక్కనే. ఇక గ్రౌండ్ ఫ్లోర్ లో పబ్లిక్ రిలేషన్స్, 'అమ్మా, నాన్న ఆనంద నిలయం' కార్యాలయాలున్నాయి.

"ఈ ప్రక్కన డోమ్ ఆకారంలో ఉన్న భవనం?" బృందములోని ఓ వ్యక్తి అడిగాడు.

"అది రిక్రియేషన్ కాంప్లెక్స్. అక్కడ చెస్, క్యారమ్స్ రూములు, టేబుల్ టెన్నిస్ కోర్టు, వ్యాయమశాల, గ్రంథాలయం, దాదాపు వేయి మంది కూర్చునే వీలున్న ఎ.సి. ఆడిటోరియం ఉన్నాయి. పదండి, మనం ఈ కాంప్లెక్స్ లోని భవనాలను ప్రత్యక్షంగా చూద్దాం."

ముందు భోజనశాల ఆవరణలోకి వెళ్లారు. గ్రౌండ్‌ఫ్లోర్ లో సామాగ్రి గదులు, కూరగాయలు శుభ్రం చేసి తురిమే రూము, పిండి మర మొదలగునవి ఉన్నాయి. అక్కడి సిబ్బంది యూనిఫాంలో ఉన్నారు. ఆడవారు ఒకే రంగు చీర, జాకెట్టు ధరించి కబుర్లాడుకుంటూ, నవ్వుతూ తమ పనులు చేసుకుంటున్నారు. మగవాళ్ళు కూడా ప్యాంటు షర్టు యూనిఫాంలో ఉండి తమ విధులు నిర్వహిస్తున్నారు.

"యూనిఫాంలో లేని వారెవ్వరు? ఇక్కడ ఉన్నారు."

"వీరు, ఈ నిలయంలోని నివాసులు. మరీ పనీ పాట లేకుండా ఎలా ఉండేది? అనుకునే వారు, ఇక్కడ పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్నారు. కొందరు ఇక్కడి పనుల్లో పాలు పంచుకుంటారు."

మొదటి అంతస్థులో వంటశాలలో అన్నీ ఆధునిక పరికరాలు ఉన్నాయి. అక్కడ కూడా కొందరు నిలయవాసులు సిబ్బందికి సహాయం చేస్తూ కనిపించారు.

వంటలు పరీక్షించే పరిశోధనశాల కూడా అక్కడ ఉంది. వండిన వంటలు అక్కడ పరీక్షించిన తర్వాతే వడ్డనకు తీస్తారు.

"ఇక్కడి వారందరు క్యాంటీన్లోనే భోం చేస్తారా?"

"అందరూ అని కాదు. కొందరు తమ గదుల్లోనే వంట చేసుకుంటారు. అన్ని గదుల్లో వంట గది ఉంది. ఓపిక ఉన్నవారు, వారి వంట, వారే చేసుకుంటారు. వంటకు కావలసిన సామాగ్రి స్టోర్ రూం నుంచి తీసుకోవచ్చు. క్యాంటీన్లో భోం చేయాలనుకునే వారు ముందుగా చెప్పాలి. ఆ ప్రకారం వంటలు చేస్తారు. రెండవ అంతస్థులో మరో భోజనశాల ఉంది. జనం ఎక్కువగా ఉన్నప్పుడు, లేదా ఏదైన ఫంక్షన్ సందర్భంగా దాన్ని వాడుతారు. పదండి అతి ముఖ్యమైన "అమ్మా, నాన్నా ఆనంద నిలయాన్ని దర్శిద్దాం." ఉదయకిరణ్ దారి తీశాడు.

'ఆనంద నిలయం' అయిదంతస్థుల భవనం. వంద పోర్షన్లు. ప్రతి పోర్షన్లో రెండు గదులు, లెట్రిన్, బాత్రూం, కిచెన్ ప్లాట్‌ఫాం, ఇద్దరికి సరిపోయే ఫర్నిచరు ఉన్నాయి. వంట గ్యాస్, వంట పాత్రలు కూడా ఉన్నాయి.

ఒకగదిలోకి వెళ్ళారు బృందం సభ్యులు.

"మీ పేరు?" గదిలో ఉన్నతన్ని అడిగాడు ఓ డెలిగేట్. ఉదయకిరణ్ దుభాసిగా వ్యవహరించాడు.

"అప్పల నరసింహం."

దాదాపు అరవై అయిదు సంవత్సరాలుంటాయతనికి.

"మీ గురించి చెబుతారా?"

"మాది ఇక్కడికి మూడు వందల కిలో మీటర్ల దూరంలో ఉన్న పల్లెటూరు. ఉన్న కొద్ది భూమిలో వ్యవసాయం చేస్తూ నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేశాం. ముగ్గురమ్మాయిల పెళ్ళిళ్ళు చేశాం. అబ్బాయిని ఎం.కాం. దాకా చదివించాను. మాకు మాట మాత్రమైన చెప్పకుండా, మా ప్రమేయం లేకుండా తను ప్రేమించిన అమ్మాయిని

పెళ్ళి చేసుకున్నాడు. మాకెందుకు చెప్పలేదని నిలదీస్తే, మీలాంటి చాదస్తులు ఈ కులాంతర వివాహానికి ఒప్పుకోరని తెలిసే మా దారి మేము చూసుకున్నాం అని కుండ బ్రద్దలు కొట్టి చెప్పాడు. కొత్త పెళ్ళాం మోజులోపడి మమ్మల్ని పట్టించుకోవడం మానేశాడు. ఇంటి ఖర్చులకు ఇవ్వాల్సిందిపోయి. మమ్మల్నే పొలం అమ్మమని వేధించసాగాడు. మేము ససేమిరా అంటే, మా మానాన మమ్మల్ని వదిలి పడుచు పెళ్ళాముతో పట్నం పోయాడు. వాడి మామ పరపతితో బ్యాంకు ఉద్యోగం దొరికింది. వాడు హాయిగానే ఉన్నాడు కాని నా భార్య వాడి మీద బెంగతో మంచంపట్టి ఆర్నెల్లలో కన్నుమూసింది. నేనిలా ఇక్కడ తేలాను." నిర్వేదంగా చెప్పాడు అప్పల నరసింహం.

"మీ వివరాలు చెబుతారా?" అదే గదిలో ఉన్న ఇంకొకతన్ని అడిగాడు ఓ సందర్శకుడు.

ఆయన బిడియస్తుడిలా ఉన్నాడు. పై వారితో మాట్లాడడానికి భయంలా ఉంది. బిత్తర చూపులు చూస్తూ, అలాగే కూర్చున్నాడు.

అప్పల నరసింహమే చొరవ తీసుకొని, ఆ రెండవ శాల్తీ గురించి చెప్పసాగాడు.

"ఈయన పోలయ్య. ఇక్కడికి వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న ఊర్లో ఉండేవాడు. ఈయన భార్య చనిపోయినపుడే డాక్టర్ త్రినాథరావు వీరి ఊరికి వెళ్ళారు. ఒక విధంగా ఈయనే "ఆనంద నిలయం" స్థాపనకు ప్రేరణ.

పొరుగు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం, ముందుకు సాగింది. ఇంకొందరిని కలిశారు. వారి వివరాలు తెలుసుకున్నారు. గతిలేక కొందరు, ఏకాకితనం భరించలేక కొందరు, జీవన సంధ్యాసమయంలో నలుగురికి సాయపడదామనే సదుద్దేశముతో కొందరు, అలా ప్రతి ఒక్కరూ ఒక్కో కారణం వల్ల అక్కడ చేరారు. ప్రతి ఒక్కరిదీ ఒక్కో గాథ. ఆ తరువాత వారు సంస్థ పరిసరాలు చుట్టబెట్టారు. 'ఆనంద నిలయం' ఒక వృద్ధాశ్రమంలా కాకుండా ఒక వినోద కేంద్రంలా ఉంది. స్విమ్మింగ్ పూల్, అధునాతన పరికరాల వ్యాయామశాల, జాగింగ్ ట్రాక్, ఉద్యానవనాలు, పిల్లల ఆట పరికరాలున్న తోట, ప్లేగ్రౌండ్ అలా వంద ఎకరాల మేర ఉన్న భవ్య ప్రాంగణమది.

అక్కడ నివాసులకే కాకుండా అందరికి అందుబాటులో ఉన్న ఓ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, విజిటింగ్ డాక్టర్లకు కన్సల్టెన్సీ గదులు, ఐ.సి.యు., ఆపరేషన్ థియేటర్, పాథాలజీ లబొరేటరీ ఇవన్నీ ఆసుపత్రి భవనంలో ఉన్నాయి. దాని ప్రక్కనే సిబ్బంది ఆవాసాలు ఉన్నాయి. అక్కడ నివసించే వారికి ప్రతినెలా వైద్య పరీక్షలు జరిపి తగు చికిత్స చేస్తారు. ప్రతి వారి ఆరోగ్య డైరీ ఆసుపత్రి పత్రాల్లో ఉంచుతారు.

ఆనంద నిలయ పరిసరాలు చూడడానికి మూడు నాలుగు గంటలు పట్టింది. డైనింగ్ హాల్‌లో వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. భోజనం తరువాత, సాయంత్రం డాక్టర్ త్రినాథరావుతో ముఖాముఖి ఏర్పాటు చేశారు.

లఘు సమావేశ సందనంలో అంతా ఆసీనులయ్యారు. డాక్టర్ త్రినాధరావు డాక్టర్ వసంత గారు రాగానే ప్రశ్న – జవాబు పరంపర మొదలైంది.

"ఇంత యోజనా బద్ధంగా ఈ సంస్థ నెలకొల్పినందుకు, మొట్టమొదట మీ ఇద్దరికీ అభినందనలు. ఇక్కడి నివాసుల తరపున ధన్యవాదాలు." బృందం నాయకుడు అన్నాడు.

"మీ అభినందనలకి ధన్యవాదములు. ఐతే ఈ సంస్థ నెలకొల్పడంలో ఎంతో మంది కృషి ఉంది. మీ అభినందనలు వారికే చెందుతాయి." డాక్టర్ త్రినాధరావు.

"ఈ సంస్థ నెలకొల్పిన మీరు ఒక విధంగా అమ్మా నాన్నలను వారి కుటుంబము నుండి విడదీస్తున్నట్టేగా?"

"ఇది చాలా చర్చినీయాంశం. ఈ విషయంలో కొన్ని రోజులు వాదోపవాదాలు చేయవచ్చు. అయినా క్లుప్తీకరించబడటానికి ప్రయత్నిస్తాను." డాక్టర్ త్రినాధరావు కొనసాగించాడు.

"ఈ యాంత్రిక యుగములో మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు అడుగంటుతున్నాయి. అంతా వ్యాపారమయి పోయింది. కుటుంబంలో కూడా డబ్బుదే ముఖ్య పాత్రయింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మన సంస్కృతి, సాంప్రదాయానికే ముప్పు వచ్చే ప్రమాదముంది. వసుధైక కుటుంబం ఒక నానుడి గానే ఉండిపోయే ప్రమాదముంది. మా ఈ సంస్థతో కుటుంబ పరిధి పెంచాలనే తాపత్రయం. కుటుంబాలను విచ్ఛిన్నం చేయడంకాదు. మా ముఖాముఖికి వచ్చిన వారిని సాధ్యమైనంత మేర వారి కుటుంబంతోనే ఉంచడానికి ప్రయత్నిస్తాము. కౌన్సిలింగ్ ద్వారా వారి ఉద్దేశ్యం మార్చే ప్రయత్నం చేస్తాం. పిల్లలు వేరే రాష్ట్రంలోనో, దేశంలోనో ఉన్నప్పుడు ఇక గత్యంతరం లేదు కదా! మా ఆనంద నిలయంలో ఉన్నవారిలో కేవలం పది శాతం మాత్రమే వారి కుటుంబం నుండి విడిపడ్డవారు. దానికి ఆర్థిక పరమైన కారణాలకు తోడు, జనరేషన్ గ్యాప్ వల్ల వారు, వారి కుటుంబంతో ఇమడలేక పోవడం కూడా ఒక కారణం."

"మీ సంస్థకి అయిదు వందల ఎకరాల స్థలం అవసరమా? చూస్తే ఇది రియల్ ఎస్టేట్ ప్రణాళికలా ఉంది." డాక్టర్ త్రినాధరావు మనసు చివుక్కుమంది. డాక్టర్ వసంతకు కూడా కోపం వచ్చింది. ఆమె ఆవేశంలో ఏదో అనబోయేంతలో డాక్టర్ త్రినాధరావు వారించాడు. శాంతంగా సమాధానం చెప్పసాగాడు.

"సేవా సంస్థల ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారిని గమనించి మీరిలా అడగడంలో తప్పులేదు. అయితే ఈ భూమి, ప్రభుత్వం చవగ్గా ఇచ్చింది కాదు. ఏళ్ళ తరబడి బీడుగా ఉన్న భూమిని, మార్కెట్టు ధరకంటే పది శాతం ఎక్కువిచ్చి కొన్న భూమి ఇది. అయినా డబ్బు గడించడానికే అయితే మాకు, మన దేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే అవసరంలేదు. 'అమ్మా, నాన్నా ఆనంద నిలయ' నిర్వహణకు పదేళ్ళు సరిపడా మూలనిధి బ్యాంకులో వేశాం. దానిపై వచ్చే వడ్డీతో ఇంకా కొన్నేళ్ళు ఈ సంస్థ నిర్వహణకు ఢోకాలేదు. కూర్చుని తింటే పర్వతాలు కూడా కరుగుతాయి. అందుకని, ఈ ఆవరణలో ఎన్నో కార్యకలాపాలు నిర్వహించనున్నాము. స్వల్ప లాభాపేక్షతో, అధునాతన పద్ధతులతో కార్పొరేట్ తరహాలో వ్యవసాయం చేపట్టాం. ఇక్కడి ప్రజల ముఖ్యంగా బీద కుటుంబ స్త్రీల ఉపాధికై కుటీర పరిశ్రమలను నెలకొల్పాలని ఉంది. త్వరలో ఇక్కడ కుటీర పరిశ్రమల విభాగం రూపుదిద్దుకోనుంది. ఈ రోజుల్లో మనం రోజూ ఇంట్లో వాడే సబ్బు దగ్గరనుంచి టివి., ఫ్రిజ్ దాకా అన్నీ బహుళజాతి విదేశీ సంస్థల చేతుల్లో ఉన్నాయి. మన దేశీయ సంస్థలు కూడా విదేశీ సంస్థలతో చేతులు కలుపవలసిన దుస్థితి ఏర్పడింది. టి.వి లాంటి శక్తివంతమైన మాధ్యమం ద్వారా ప్రకటనలు చేపట్టి, బహుళజాతి సంస్థలు గ్రామ గ్రామాల్లోకి చొచ్చుకు పోయాయి. మన వినియోగశక్తిని, మన దేశ సంపత్తిని, మన శ్రమను దోపిడీ చేస్తున్నాయి. మన సంపదలను వారి దేశాలకు తరలించుకుంటున్నాయి. ఈ విషయంలో మనం ప్రేక్షక పాత్ర వహించక, ఆ పాటి ఉత్పత్తులు మనమూ తయారు చేయగలం అని నిరూపించాలి. మన శ్రమ శక్తితో సబ్బులు, డిజర్జెంట్లు, అగరు బత్తీలు, అప్పడాలు, పచ్చళ్ళు, రెడీమేడ్ దుస్తులు, హ్యాండీ క్రాఫ్ట్స్ ఇలా ఎన్నో ఉత్పత్తులు మనం చేయవచ్చు. మన అవసరాలకు వాడి, మిగిలినవి ఎగుమతి కూడా చేయవచ్చు. ఈ ప్రకల్పాలకు సంబంధించిన అన్ని ప్రణాళికలు తయారయ్యాయి. ఇక ఒక్కొక్కటిగా అమలు చేయడమే తరువాయి." డాక్టర్ త్రినాథరావు మంచి నీళ్ళు త్రాగాడు.

"మీ అగ్రో హార్టికల్చరల్ విభాగ వివరాలు చెప్పండి."

"మా సంస్థ వివరణ పత్రంలో రాసినట్టుగా, అయిదొందల ఎకరాల స్థలంలో, నాలుగు వందల ఎకరాలు వ్యవసాయ చెట్లు, తోటలకు సంబంధించిన కార్యకలాపాలకు కేటాయించాము. ఆధునాతన పద్ధతులతో సాగు చేయడం ఒక కారణమైతే పర్యావరణ రక్షణ, ఇంకో కారణం. మా ప్రాంగణంలో లక్షకుపైగా చెట్లు నాటాం. ఈ విభాగం కూడా ఎగుమతికి అవకాశం ఉండే పంటలను పండిస్తుంది. ఔషధ మొక్కలు కూడా పెంచుతుంది.

త్వరలో మన దేశంలో రిటైల్ రంగ విప్లవం రానుంది. ఎన్నో విదేశీ సంస్థలు ఈ రంగంలోకి దూకడానికి శతప్రయత్నాలు చేస్తున్నాయి. వాటిని నిలువరించడానికి కూడా మా ఈ చిన్ని ప్రయత్నం దోహదం చేస్తుంది.”

“బహుళజాతి సంస్థలతో పోలిస్తే, వారి ధనబలం ముందు, మీ ఈ చిన్న ప్రయత్నం తూగుతుందా?”

“వారి ధన బలానికి, మన శ్రమశక్తి ధీటు. విదేశాల్లో పనిచేసిన మాకు, అక్కడి నిర్వహణ పద్ధతులను మనకు అనుకూలంగా, మన శ్రేయస్సుకై వాడుకునే తెలివుంది. ఇక్కడి వివిధ రంగాల నిపుణులు, విదేశాల్లో పనిచేసే మన భారత సంతతివారు, మాకు పూర్తి సహకారం అందించనున్నారు. అందుకని, మా ఈ సంస్థ సఫలం అవుతుందనటంలో సందేహం వద్దు.”

“మీ మాటలు వింటూంటే ఇవన్నీ పుస్తకాల్లో పలుకుల్లాగా కేవలం ఆదర్శం కోసం చేసే వాదంలా అనిపిస్తుంది. మన దేశ పరిస్థితుల్లో మీ ఆశయాలు నెరవేరుతాయా?”

“మీ అనుమానం సబబే. నిత్య శంకితులకు మన దేశంలో కొదవలేదు. వారిని పట్టించుకుంటే మనం ఏ పనీ చేయలేము. మనలో చిత్తశుద్ధి ఉంటే అసాధ్యమనుకున్నవి సుసాధ్యమౌతాయి. ఎంతదూర ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలౌతుంది. ఆ ఒక్క అడుగు మేము వేశాము. మీలాంటి వారి సహకారం లేకపోయినా, సద్భావము ఉంటే చాలు, చాలా తొందరగా మా ఈ ప్రయాణం తన గమ్యాన్ని చేరుకుంటుంది.”

“మీ ఆశయాలకు, ఆలోచనలకు జోహార్లు. ఈ సంస్థ ట్రస్టు రూపంలో ఉన్నా, దీని ఆధిపత్యం, ఆస్థి మీ కుటుంబందే కదా. కాదంటారా?”

“మీరు, మా ట్రస్టీల పేర్లు చదివినట్టు లేదు. మన దేశంలో ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, ఆర్థిక నిపుణులు, పర్యావరణ యోధులు, డాక్టర్లు, ఇంజనీర్లు మా ట్రస్టు సభ్యులుగా వున్నారు. మా దంపతులం తప్ప వేరే ఏ సభ్యుడూ మా కుటుంబానికి చెందినవారు కాదు. అమెరికాలో ఉన్న మా పిల్లల ఆశయాలు మా ఆశయాలతో సరిపోవు. వారక్కడ, వారి అభిరుచులకు తగ్గట్టుగా జీవిస్తున్నారు. ఈ సంస్థ ఆస్తుల మీద వారికేమాత్రం ఆశలేదు. అందుకని మీకీ అపోహ అక్కరలేదు.”

“డాక్టర్ వసంతగారి మనోగతం తెలుసుకోవాలనుంది.”

“మా సంస్థకు సంబంధించిన చాలా విషయాలు డాక్టర్ త్రినాధరావుగారు వివరించారు. మీరు అడుగుతున్నారు కాబట్టి నా భావాలు మీతో పంచుకుంటాను.” డాక్టర్ వసంతగారు కొనసాగించారు.

"త్రినాథ్ మొట్టమొదట ఈ విషయం చెప్పినప్పుడు నేనంత సుముఖంగా లేను. నాలో ఎన్నో అనుమానాలు. అతి ముఖ్యంగా, ఇక్కడి రాజకీయాల గురించి. మన వారి మనస్తత్వం గురించినవి. ఉద్దేశ్యాలు ఎంత ఉదాత్తమైనా వాటి ఆచరణలో ఎన్నో అవాంతరాలు రావచ్చు. ప్రకృతి ప్రకోపాలను తట్టుకోవచ్చుగాని మనుషుల కుత్సితాలను భరించలేము. అదే మా వారితో అన్నాను. దానికాయన శాంతంగా, హేతుబద్ధ వివరణ ఇచ్చారు. జీవితంలో ఎంత సాధించినా మనం మన వారికి, మన దేశానికి ఏదైనా చేద్దాం అని ఒప్పించారు. మనం చిత్తశుద్ధితో పని చేస్తే ఎన్ని అవాంతరాలైనా ఎదుర్కో వచ్చుని ధైర్యం చెప్పారు. అందుకని నేనూ మా వారితో ఇక్కడికి తిరిగి వచ్చాను. మా విజయం మీ సహకారంతో ముడిపడి వుంది. మమ్మల్ని నిరాశ పర్చరనుకుంటాను." డాక్టర్ వసంత తన ప్రసంగం ముగించింది.

"చాలా చాలా ధన్యవాదాలు డాక్టర్ వసంతగారూ! మీ ఇరువురి ప్రయత్నాలు సఫలం కావాలని కోరుకుంటున్నాము. ఈ సంస్థ నిర్వహణ గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నాము. మీలో మీ ఆశయాల పట్ల, ఎంత నిబద్ధత ఉందో తెలుసుకోవడానికి మాత్రమే కొన్ని ఉద్దేశ పూరిత ప్రశ్నలు అడిగాము. వాటికి మీ మనసు నొప్పిస్తే క్షమించండి. మీ ఈ బాటలో మా రాష్ట్రం కూడా నడుస్తుందనే నమ్మకంతో సెలవు తీసుకుంటున్నాము." బృందం నాయకుడు స్వస్తి వ్యాక్యాలు పలికాడు.

"ఇది ప్రారంభం మాత్రమే. ఇలాంటి ప్రకల్పాలు ప్రతి జిల్లాలో మొదలు పెడితే, మన దేశానికి ఇక తిరుగుండదు." అని డాక్టర్ త్రినాథరావు సమావేశం ముగించాడు. అతనిలో ఒక స్థిరత్వం. సంస్థ తప్పక విజయవంతం ఔతుందనే దృఢ విశ్వాసం. కళ్ళలో మాతృభూమికి సేవ చేయాలనే తపన.